క్లుప్తంగా

ముగిసిన కొడి పీర్ల పండగ



జలధికి వెళ్తున్న కోయనగర్ కాలనీ కొడి పీర్లు

ఆలూరు రూరల్: మతసామర్యానికి ప్రతీకైన కొడి పీర్ల పండగ మంగళవారం ముగిసింది. గత పది రోజులకు క్రితం మండలంలోని కోయనగర్ కాలనీలో పీర్లు కొలువుదీరాయి. మంగళవారం సాయంత్రం జలధికి తరలివెళ్లారు. భక్తులు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు.ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని సంబరాలు చేసుకున్నారు. కోయనగర్ కాలనీ నుంచి స్థానిక కొత్త బస్టాండ్ వరకు కులమతాలకు అతీతంగా వచ్చి జలధికి సాగనంపారు. ఎస్ఐ డాక్టర్ నాయక్ సమక్షంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని బోయబొంతిరాళ్ల లో ఆరు రోజులుగా కొనసాగుతున్న చిన్న పీర్ల పండుగ మంగళవారం పీర్లు ఏటికి తరలడంతో ముగిసింది. పురవీధుల గుండా సాగిన పీర్లకు భక్తులు పూజలు నిర్వహించారు. సమస్యాత్మక గ్రామం కావడంతో ఎస్ఐ సురేశ్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ



మొలగవల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ రఘురామిరెడ్డి

ఆలూరు రూరల్: చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పత్తికొండ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ రఘురామి రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని మొలగవల్లి పీహెచ్‌సీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ నెల 10న అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ఆల్బెండజోల్ (నులి పురుగుల నివారణకు) మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. గురువారం మాత్రలు అందుకోని వారికి ఈ నెల 17వ తేదీన పంపిణీ చేయాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి ఉన్నారు.

పేద విద్యార్థులకు ఆర్డీటీ అండ

ఆలూరు: అట్టడుగు వర్గాల బాలబాలికల చదువుకు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఆర్డీటీ) అండగా నిలుస్తోందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం ఆర్టీటీ ఏరియా కో-ఆర్డినేటర్ హనుమంతప్ప సమక్షంలో గ్రామీణ బాలికల క్రీడల మీట్-2023ను ప్రారంభించారు. ఎంఈఓ కోమలాదేవి, పీడీ కవిరాజ్ పాల్గొని ఆర్డీటీ సేవలను వివరించారు. వివిధ క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులను అందజేశారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలోని ఆయా వీధుల్లో మంచినీటిని సరఫరా చేసే పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టేందుకు గ్రామ సర్పంచ్ కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్కే గిరి, దుర్గన్న చర్యలు చేపట్టారు. గత కొద్ది రోజులుగా పైప్‌లైన్లు దెబ్బతిని లీకేజీలు ఏర్పడడంతో మంచి నీరంతా వృథాగా పోయేవి. విషయం సర్పంచ్ దృష్టికి వెళ్లడంతో ఆమె మంగళవారం మరమ్మతు పనులు చేయించారు. లీకేజీని అరికట్టి కలుషిత నీటి సరఫరా జరగకుండా, నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టారు.


సమస్యల పరిష్కారానికి కృషి

హొళగుంద: గ్రామంలో సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చలవాది రంగమ్మ, వైస్ సర్పంచ్ మీనాక్షి ఆధ్వర్యంలో వార్డు సభ్యులతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి వీధిలో పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైనేజీల శుభ్రత, పూడిక తొలగింపు తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. తాగునీరు, వీధి దీపాల ఏర్పాటు ఇతర సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, నిధుల వెచ్చింపుతో పాటు ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానం చేశారు.

ఇంకుడు గుంతలు తవ్వుకోండి

మద్దికెర: ఇళ్ల నుంచి మురుగునీరు రోడ్లపై వదలకుండా ఇంకుడు తవ్వుకోవాలని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంత తవ్వుకుంటే ప్రభుత్వం రూ.6 వేలు సాయం ఇస్తుందన్నారు. జగనన్న కాలనీల్లోని ఇళ్లకు కూడా ఈ అవకాశం ఉందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కలవరపెడుతున్న 'లంపీస్కిన్'




హొళగుందలో వ్యాధి సోకిన ఆవు

హొళగుంద: మండలంలో ఎద్దులు, ఆవులు లంపీ స్కిన్ (ముద్ద చర్మం) వ్యాధి బారిన పడుతుండడంతో పాడిరైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ కావడంతో ఎల్లెల్సీ కింద వరినాట్లు, ఇతర పనులు జోరందుకున్నాయి. ఎద్దులతో అవసరం ఉండగా కొత్త రకం వైరస్ సోకి ఎద్దులు, ఆవుల శరీరంపై బొబ్బలు, బొడిపెలు వస్తున్నాయి. దీంతో రైతులు పశువైద్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. ఈ వైరస్ వల్ల ప్రమాదమేమి లేదని కొద్ది రోజుల్లో తగ్గిపోతుందని పశు వైద్యాధికారి సోమశేఖర్‌గౌడ్ తెలిపారు. వ్యాధి లక్షణాలను బట్టి చికిత్స చేస్తున్నట్లు చెప్పారు.

మందుల పిచికారీలో జాగ్రత్తలే రక్ష

ఎమ్మిగనూరు డివిజన్‌లో ఖరీఫ్ సాగు వివరాలు		
పంట	సాధారణ విస్తీర్ణం (హెక్టార్లలో)	సాగు చేసిన విస్తీర్ణం (హెక్టార్లలో)
వేరుశనగ	3,712	1,547
కంది	1,124	334
పత్తి	49,266	42,643
ఆముదం	772	410
మిరప	3,688	4,768
వరి	3,043	1,210



ఎలాంటి రక్షణ లేకుండా మందు పిచికారీ చేస్తున్న రైతు,



జాగ్రత్తలు పాటిస్తూ ద్రావణం సిద్ధం చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉంటారు. పంటలు సాగు చేసినప్పటి నుంచి ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసి పిచికారీ చేసుకునేందుకు సన్నద్ధం అవుతుంటారు. ఇలాంటి సమయాల్లో రైతులు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల నుంచి బయటపడవచ్చని ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి చెపుతున్నారు. నకిలీ పురుగు మందుల బెడద ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్నారు. శుక్రవారం ఎరువుల కొనుగోలు, రసాయన పురుగు మందుల వాడకంపై రైతులకు సూచనలు సలహాలు చేశారు.

పురుగు మందుల కొనుగోలు

ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు వేరుశనగ, పత్తి, వరి, ఉద్యాన పంటలైన టమాట, వంగ, బీర, కర్బూజా వంటి పంటల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. పంటలకు ఆశించే తెగుళ్ల నివారణకు రైతులు కొనుగోలు చేసే రసాయన పురుగు మందుల విషయంలోజాగ్రత్తగా ఉండాలి. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఎరువుల దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. ఎరువుల డబ్బాలపై వజ్రాకారంలో పురుగు మందుల స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైనవి నీలిరంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగుల గుర్తులుంటాయి. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సూచించిన మందులను మాత్రమే వినియోగించాలి. చీడపీడలపై అధికారుల దృష్టికి తీసుకువచ్చి వారి సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలి. రసాయన పురుగు మందులను అవసరానికి మించి కొనుగోలు చేయవద్దని, ముందస్తుగా పురుగు మందులను కొనుగోలు చేసి నిల్వచేయవద్దని అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు

పురుగు మందులు నిల్వ చేసినప్పుడు, పిచికారీ చేసేటప్పుడు అజాగ్రత్తగా ఉంటే ప్రమాదం తప్పదు. ఆహార పదార్థాలతో పాటు కీటక నాశిని మందులను రవాణా చేయరాదు. ఇంట్లో ఉంచినప్పుడు తాళం వేసి భద్రపరచాలి, పిల్లలకు అందకుండా ఉండే చోట నిల్వ చేయాలి. అసలైన ప్యాకింగులతోనే కీటక, తెగుళ్ల నాశిని మందులను కొనాలి. ఉపయోగించే ముందు లేబుల్, వివరాల పత్రాన్ని చదవాలి. స్ప్రే చేసేటప్పుడు తలకు రక్షణగా హెల్మెట్, శరీరానికి పూర్తిగా రక్షణ కల్పించే వస్త్రాలను, మాస్కులను ధరించాలి. సిఫార్సు చేసిన పరిమాణాన్ని సరిగా కొలిచి తీసుకోవాలి. కర్రతో బాగా కలియబెట్టాలి. మందు డబ్బాల్లో ఆహార పదార్థాలు, నీరు నిల్వ చేసేందుకు ఉపయోగించరాదు. గాలి వీచే దశలో పిచికారీ చేస్తూ నడవాలి. నాజిల్ శుభ్ర పరిచేందుకు నోటితో ఊదరాదు, పిచికారీ చేసేటప్పుడు ఆహార పదార్థాలను తినకూడదు, పొగ తాగరాదు. చిల్లు పడిన, పాడైన స్ప్రేయరు, దస్తరు వాడరాదు, ప్రమాదవశాత్తు శరీరంపై గానీ, దుస్తులపై మందు పడితే శుభ్రం చేసుకోవాలి. పిల్లల చేత పిచికారీ చేయించరాదు. ఉదయం, సాయంత్రం పూటనే పిచికారీ చేయాలి. తినేముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. ప్రమాదవశాత్తు విషప్రభావం కలిగితే ప్రాథమిక చికిత్స చేసే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లి కీటకనాశిని మందు డబ్బా, వివరాల పత్రాన్ని చూపించి వైద్యం చేయించుకోవాలి. ఖాళీ డబ్బాలను చితక్కొట్టి భూమిలో పాతిపెట్టాలి. మందు పిచికారీ చేయడం పూర్తయిన వెంటనే స్నానం చేసి దుస్తులను శుభ్రపరుకోవాలి. ఈ పద్ధతులను పాటిస్తే ప్రమాదాల బారి నుంచి బయటపడవచ్చని ఏడీఏ చెపుతున్నారు.

11న కైరుప్పల మార్కెట్ వేలం

ఆస్పరి: మండలంలోని కై రుప్పల గ్రామంలో ఈనెల 11వ తేదీన కూరగాయల మార్కెట్ నిర్వహణ హక్కుల వేలం వేయనున్నట్లు సర్పంచ్ తిమ్మక్క మంగళవారం తెలిపారు. ఆసక్తి గల వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

చిప్పగిరి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను మండలంలోని డేగులహాలు గ్రామంలో మంగళవారం ఆ గ్రామ సర్పంచ్ నీలకంఠ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

పాడి పశువులకు టీకాలు

చిప్పగిరి: పాడి పశువుల్లో ముద్ద చర్మవ్యాధి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా బూస్టర్ డోస్ వ్యాక్సినేషన్ ప్రక్రియను స్థానిక పశు వైద్యశాలలో మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ ప్రసన్నాబాయ్ మాట్లాడుతూ.. వాక్సినేషన్ కార్యక్రమం ఈ నెల చివరి వరకు ఉంటుందని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా గొర్రెలకు నీలినాలుక, గొంతు వాపు చిటుక తదితర వ్యాధులకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ గోవిందరాజులు, సిబ్బంది నారాయణ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాల రారాజు సీఎం జగన్



చెన్నాపురంలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: సంక్షేమ పథకాల రారాజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని కోటేకల్ సచివాలయం పరిధిలోని చెన్నాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు సంక్షేమ పథకాలు అందించాలన్నదే సీఎం వైఎస్ జగనన్న ఆశయమన్నారు. పారదర్శకంగా, ఆదర్శంగా ప్రభుత్వ పాలన కొనసాగుతుందని వివరించారు. గతంలో మాదిరగా గాకుండా సంక్షేమ పథకాలునేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే అందుతున్నాయని చెప్పారు. సర్పంచ్ జాలవాడి లక్ష్మీ, ఎంపీటీసీ నరసింహులు, జాలవాడి లక్ష్మన్న, గడ్డం తిక్కన్న, కేవై.వెంకటేశ్వర్లు, బోడి లింగన్న, జి.హనుమంతు, కెవై.లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



తెర్నెకల్‌లో నిర్మాణం పూర్తయిన ఇళ్ల వివరాలను తెలుసుకుంటున్న హౌసింగ్ పీడీ వెంకటనారాయణ

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో వైఎస్సార్ జగనన్న కాలనీని మంగళవారం హౌసింగ్ పీడీ వెంకటనారాయణ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ తెర్నెకల్ గ్రామంలోని జగనన్న కాలనీని ప్రారంభించేందుకు ఎంపిక చేయడంతో జిల్లా హౌసింగ్ పీడీ వెంకటనారాయణ బృందం కాలనీకి వచ్చి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి వెలుగు పొదుపు లక్ష్మి గ్రూపు ద్వారా రూ.35 వేలు అదనంగా రుణం ఇప్పిస్తామని, అందరూ అనుకున్న తేదీలోపు అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామ సర్పంచ్ ఎం.అరుణ్ కుమార్, హౌసింగ్ ఈఈ ప్రభాకర్, ఏఈలు ఆదినారాయణ, అనిరుధ్, పంచాయతీ కార్యదర్శులు తలారి రాముడు, సునీత, వర్క్ఇన్‌స్పెక్టర్‌లు నాగరాజు, గౌడ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం



కొసనాపల్లెలో చీని తోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

వెల్దుర్తి: పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నూరు శాతం సబ్సిడీతో మొక్కలు, నిర్వహణ ఖర్చులు ఇస్తోందని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి వివరించారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని కొసనాపల్లెలో రైతు పొలంలో ఈజీఎస్ సబ్సిడీ ద్వారా నాటిన చీని మొక్కలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వెల్దుర్తి మండలంలో ఈ ఏడాది దాదాపు 270 ఎకరాల్లో తమ శాఖ ద్వారా పండ్ల తోటల సాగుకు సహకారం అందించినట్లు తెలిపారు. చీని, జామ, దానిమ్మ, మునగ ఇతరత్రా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఓ రాజునాయక్, ఈసీ భరత్, టీఏలు రాజు, శ్రీనివాసరావ్ వెంట ఉన్నారు.

ఆర్‌ఏఎఫ్ సిబ్బంది కవాతు



ఎమ్మిగనూరులో ఆర్‌ఏఎఫ్ సిబ్బందితో కలిసి కవాతులో పాల్గొన్న డీఎస్పీ సీతారామయ్య

ఎమ్మిగనూరురూరల్: శాంతిభద్రతల పరిరక్షణలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ పోలీసుల పాత్ర కీలకం అని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో హైదరాబాద్‌కు చెందిన 99 బెటాలియన్ డిప్యూటీ కమాండర్ భోఘేల్, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో స్థానిక పట్టణ పోలీసుస్టేషన్ నుంచి సోమప్ప, గాంధీ సర్కిల్, పూల బజార్, షరాఫ్ బజార్, సోమేశ్వర, శ్రీనివాస, వైఎస్సార్ సర్కిల్ మీదుగా ఆర్‌ఏఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగినప్పుడు మేమున్నామంటు ప్రజల్లో ధైర్యం నింపేందుకు ఆర్‌ఏఎఫ్ పోలీసులు ఉంటారని చెప్పారు. ప్రజల్లో పోలీస్ వ్యవస్థ పటిష్టంగా ఉందనే నమ్మకం కలిగించేందుకు ర్యాలీ చేసినట్లు తెలిపారు. కవాతులో పట్టణ, రూరల్ సీఐలు మధుసూదన్‌రావు, మోహన్‌రెడ్డి, ఎస్ఐలు మస్తాన్‌వలి, నిరంజన్‌రెడ్డి, సురేష్‌బాబు, ఆర్పీఎఫ్ 99 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్లు ఏకే.శర్మ, శంకర్‌యాదవ్, రాబిన్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు వార్డు స్థానాలకు ఎన్నికలు

చిప్పగిరి: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని ఏరూరు 5వ వార్డు (బీసీ ఉమెన్), కుందనగుర్తి 7వ వార్డు (బీసీ జనరల్) స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీపీ కొండయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 14న సాయంత్రం 3 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం ఉందని తెలిపారు. 19న ఉదయం 7గంటల నుంచి 1 గంట వరకు పోలింగ్ అదేరోజు 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు తదనంతరం ఫలితాల వెల్లడి ఉంటుందని తెలిపారు. ఏరూరు గ్రామ సచివాలయంలో, కుందనగుర్తి ఎంపీయూపీ పాఠశాలలో రిటర్నింగ్ అధికారులచే నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

తొలిరోజు నామినేషన్లు నిల్

నందవరం: మండల పరిధిలోని హాలహర్వి గ్రామ పంచాయతీలో ఏడవ వార్డుకు సంబంధించి మొదటి రోజు మంగళవారం నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రఘునాథ్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వార్డు ఎన్నికకు సంబంధించి నోట్ బోర్డును అధికారులు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడవ వార్డులో ఎస్సీ జనరల్ స్థానానికి రిజర్వ్ అయినట్లు తెలిపారు. 10వ తేదీ వరకు నామినేషన్లకు అవకాశం ఉందని చెప్పారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శి సుజాత, పోలీసులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల పరిధిలో ఖాళీగా ఉన్న 4 వార్డు మెంబర్ల స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభం కాగా తొలిరోజు నామినేషన్లు దాఖలు కాలేదని ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ లలిత తెలిపారు. బొమ్మిరెడ్డిపల్లె (బీసీ), కలుగొట్ల (జనరల్-మహిళ), కృష్ణాపురం (జనరల్), ఎల్ నగరం (పిక్కిలివానిపల్లె - జనరల్) గ్రామాలలోని ఖాళీగా ఉన్న వార్డులకు ఆయా రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు.

సారా విక్రేత అరెస్ట్

వెల్దుర్తి: కోడుమూరు సెబ్ బృందం, స్థానిక పోలీసులు మంగళవారం జరిపిన దాడుల్లో రామళ్ల కోట గ్రామ పరిసరాల్లో సారా తరలిస్తున్న కల్లూరు మండలం కొళ్లంపల్లి తండాకు చెందిన హనుమాన్ నాయక్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి 20 లీటర్ల నాటుసారా, ఎక్స్ఎల్ మోపెడ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని డోన్ కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించామన్నారు.

గడప గడపకు సంక్షేమ పాలన



సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి గడపకూ సంక్షేమం అందుతోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం మేటే తండా, సూర్య తండా, ఉప్పర్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. తండాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని సుగాలీలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న కడమకుంట్ల గ్రామానికి చెందిన రామచంద్ర కుటుంబాన్ని పరామర్శించారు. ఉప్పర్లపల్లి సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్నాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగేష్, మోహన్‌రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, భీమానాయక్ తదితరులు ఉన్నారు.

నేడు హాలహర్వికి మంత్రి రాక

హాలహర్వి: మండలంలోని చింతకుంట-2 పరిధిలోని సిరిగాపురం గ్రామంలో బుధవారం జరిగే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం వస్తున్నట్లు ఎంపీడీఓ ఆంతోని మంగళవారం విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

నందవరం: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని స్వచ్ఛ సర్వేక్షన్ టీం సభ్యులు ఎఫ్‌టీసీ నాగరాజు, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య పేర్కొన్నారు. మంగళవారం పూలచింత గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్ టీం పారిశుద్ధ్యం, వీధి లైట్లు, తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో 14, 15వ ఫైనాన్స్ నిధుల ఖర్చుపై పర్యవేక్షించామన్నారు. గ్రామ సర్పంచ్ అక్కమాహాదేవి ఆధ్వర్యంలోఅధికారులను పూల మాలలు, శాలువతో సన్మానించారు.

విత్తన పరీక్షలపై అవగాహన

పత్తికొండ టౌన్: జిల్లాలోని వైఎస్సార్ సమగ్ర వ్యవసాయ పరీక్షా ప్రయోగ శాలల (ల్యాబ్‌లు) ఏఓలు, ఏఈఓలకు మంగళవారం స్థానిక ప్రయోగశాలలో విత్తన పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మిగనూరు విత్తన పరీక్ష కేంద్రం ఏడీఏ శైలకుమారి ఆధ్వర్యంలో రెండవ రోజు కార్యక్రమంలో విత్తన పరీక్షలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా ల్యాబ్ అధికారులు సకాలంలో విత్తన సమూనాలను పరీక్షించి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించేందుకు కృషి చేయాలన్నారు.

బ్యాంకు అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న టౌన్‌బ్యాంక్ సీఈఓ

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక టౌన్‌బ్యాంక్ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులతో పాటు ఖాతాదారులు సహకరించాలని బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, సీఈఓ గంగాధర్ కోరారు. మంగళవారం బ్యాంక్ కార్యాలయంలో పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ లావాదేవీలు, రుణాల రికవరీ తదితర అంశాలపై చర్చించారు. వారు మాట్లాడుతూ బ్యాంకును లాభాల బాటలోకి తెచ్చేందుకు ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలందించడంతో పాటు రుణాల మంజూరు, రికవరీపై దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు సయ్యద్‌చాంద్, మహనందయ్య శెట్టి, రజాక్, పల్లవిరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

మద్దికెర: మండలంలోని జగనన్న కాలనీల్లో రోడ్లు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన కొలతల మేరకే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, సర్పంచ్ విజయుడు కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీల్లో లబ్ధిదారులు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారని దీని వల్ల భవిష్యత్తులో రోడ్లు వేసేందుకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహమూర్తి మాట్లాడుతూ.. ప్రభుత్వం కేటాయించిన స్థలాలలో మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని, లేకపోతే బిల్లులు నిలిపివేయాలని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్‌ను ఆదేశించారు. అలాగే ఎం.అగ్రహారం గ్రామంలో బీసీ కాలనీ ఏర్పడి 25 ఏళ్లు అవుతున్నా ఇంతవరకు ఇంటి పన్నులు చెల్లించడం లేదని, దీంతో అభివృద్ధి ఎలా సాధ్యపడుతుందన్నారు. వెంటనే పన్నులు వసూలు చేయాలని కార్యదర్శి సంజప్పకు సూచించారు. ఎంపీటీసీలు నీటి సమస్యపై ఏఈ మయాంక్‌ను ప్రశ్నించగా త్వరలోనే ట్యాంకులు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఇంటిపట్టాలు కోసం చాలా మంది దరఖాస్తు చేసుకున్నారని ఎప్పుడు ఇస్తారని మద్దికెర సర్పంచ్ సుహాసిని ప్రశ్నించగా సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు డీటీ నాగరాజు తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమ అభివృద్ధి గురించి తెలియజేశారు. పత్తికొండ మార్కెట్ యార్డు చైర్మన్ పక్కీరప్ప, సొసైటీ అధ్యక్షుడు శాంతన్న, ఎంపీటీసీలు రామకృష్ణారెడ్డి, రామకృష్ణ, లక్ష్మీదేవి, వేణమ్మ, ఏఓ రవి, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై రాజద్రోహం కేసు పెట్టాలి

గోనెగండ్ల: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్న మాజీ సీఎం చంద్రబాబునాయుడుపై రాజద్రోహం కేసు నమోదు చేయాలని మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. పుంగనూరులో చంద్రబాబు పక్కా ప్లాన్‌తోనే టీడీపీ కార్యకర్తల చేత పోలీసులపై దాడులు చేయించారని ఆరోపించారు. కుప్పంలో ఓటమి భయం పట్టుకోవడంతోనే బాబు ఇలాంటి నీచరాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాజకీయ భవిష్యత్ అగమ్యగోచరంగా మారడంతో రాజకీయ ఉన్మాదిలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కూడా టీడీపీకి ఘోర పరాభావం తప్పదన్నారు.

పంటకోత ప్రయోగంపై శిక్షణ

దేవనకొండ: మండలంలోని ఆర్‌బీకే సిబ్బందికి పంటకోత ప్రయోగంపై మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏఓ సురేష్‌బాబు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండలంలో వేరుశనగ, పత్తి, ఆముదం పంటలపైన శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఏపీసీసీ యాప్ ద్వారా పంట నమోదు చేసుకోవాలన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి తగిన సలహాలు, సూచనలు తెలియజేయాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజనల్ డిప్యూటీ ఎస్ఓ రవిప్రకాష్, ఏఎస్ఓ హరిబాబు, ఏఈఓ రంగన్న, జయరాములు, యోగిబాబు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే లైన్, ఆర్‌డీఎస్ పూర్తిచేయాలి

ఎమ్మిగనూరుటౌన్: మంత్రాలయం నుంచి కర్నూలుకు రైల్వే లైన్ ఏర్పాటుతో పాటు ఆర్‌డీఎస్ కుడి కాలువ నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపణ్ణగౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న కోరారు. ఈ మేరకు మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ఆయా సమస్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ సరళకు ఇచ్చారు. సీపీఐ నాయకులు చిన్నన్న, కెసీ జబ్బార్, వీరేష్, విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జియోట్యాగింగ్ ద్వారా పంటల నమోదు

మద్దికెర: ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను జియోట్యాగింగ్ ద్వారా పంటల నమోదు చేయడం జరుగుతుందని ఏఓ రవి మంగళవారం తెలిపారు. రైతులు తాము వేసిన పంటల వివరాలు తమ పొలాలకు వచ్చిన వ్యవసాయాధికారులకు తెలియజేయాలని సూచించారు. జియోట్యాగింగ్ చేయంచకపోతే పంట నష్ట పరిహారం, పంటల బీమా వర్తించవన్నారు.